వాలేదు అని అనుకుంటున్నారు. ఈ కట్నాలు లేకుండా ఎప్పుడు పోతాయో అప్పుడుగాని కన్నె పిల్లలకు జైలు నుంచి దొంగలు విడుదల చేసి నట్లు వుండదు. మన లాంటి కన్నె పిల్లలకు ఎంత చదువుకున్నా, ఏ ఉద్యోగం చేస్తున్నా రెండో పెళ్ళినుంచి కన్నె చెర విడుదల కాదు. అందాక మనలాంటి వాళ్ళకు అంటే మధ్య తరగతి కుటుంబీకులకు ఇది తప్పదు.

సీత కాపురానికి వెళ్ళింది. రోజులు బాగానే గడుస్తున్నాయి. అమ్మగారు! అన్న పిలుపుకు అప్పుడే కునుకు పట్టిన సీతకు మెళకువ వచ్చింది. ఆ వస్తున్నాను అని వీధి లోకి వెళ్ళింది. అమ్మగారు నేను రేపటినుంచి పనిలోకి రాను, ఎవరినయినా చూసుకోండి అంది లచ్చి. ఏం, ఎందుకని రావు అన్నది సీత. మా మావ పిల్లలు పుట్టకుండ అదేదో చేయించుకున్నాడండి, ప్రభుత్వం వారు 100రూ. ఇచ్చారు. మా మావ పని మాని ఆ డబ్బుతో టీ దుకాణం పెట్టాడండి. చిన్న బక్కెట్టు, పెద్ద బొగ్గుల కుంపటి కొన్నాడండి. నన్ను పని మానెయ్యమన్నాడు. అని అన్నది లచ్చి. ఎవరు తాగుతారే మీ దగ్గర అని అడిగింది సీత. క్రొత్తగా ఇల్లు కడుతున్నారు చూడండి, ఆ ఇళ్ళ దగ్గర పని చేసే కూలీలు తాగుతారండి. రోజుకు ఎంత వస్తుందే అంది సీత. రోజుకు 10 రూ. పెట్టి అన్నీ కొంటే కాని కరువు పోదు. 10 రూ. మిగులుతుంది. ప్రభుత్వం వారి దయవలన వాళ్ళ మంచి వుపకారం చేస్తున్నారు అని వెళ్ళిపోయింది లచ్చి. ఆ మాటలు విన్న సీత చదువుకున్న వాళ్ళ కన్నా వీరు నయం అని నిట్టూర్చింది.

సీత కాపురానికి వచ్చిన దగ్గర నుండి పెంద రాడే ఇంటికి వస్తున్నాడు. పిల్లలవిషయంలో కూడా శ్రద్ధ తీసుకుంటున్నాడు. సీత వాళ్ళ ఆయన లోని మార్పుకు కారణం ఆలోచిస్తున్నది. సీత ఏమిటి ఆలోచిస్తున్నావు అన్నాడు ప్రకాశం. ఏమి లేదండి అంది సీత. కళ్ళు తిరిగినట్లు అయి తూలి పడిపోయింది సీత. ఏమయింది సీత, అని కంగారు పడి డాక్టరును పిలుస్తాను వుండు అని డాక్టరుకు ఫోను చేసాడు ప్రకాశం.

డాక్టరు శాంత సీతను చూసి, మీరు తండ్రి కాబోతున్నారు అని ప్రకాశంకు చెప్పింది. నీరసం వలన కళ్ళు తిరిగినాయి అని చెప్పి వెళ్ళిపోయింది.

సీతకు మెళుకువ వచ్చి లేచింది. సీత నీవు చాలా నీరసంగా వున్నావు. మందులు వాడమని చెప్పింది డాక్టరు. నీవు తల్లివి కాబోతున్నావు అని చెప్పిన మాటలకు నేను ఓడిపోయాను, నేను ఓడిపోయానండీ. మనకన్న మన పని మనిషి నయం, చదువుకున్న వాళ్ళకన్నా వాళ్ళు ఎంతో నయం అన్నది సీత. ప్రకాశం నీవు కాదు సీత నేనే ఓడిపోయాను. మీ అక్కయ్య మాట విన్నందుకు నీకు అక్కయ్య లేకుండ చేసాను. పిల్లలకు తల్లి లేకుండా చేసాను. నేను ఆపరేషను చేసుకున్నాను అని చెప్పి ప్రకాశం అక్కడనుంచి వెళ్ళిపోయాడు. ●

# శపథం

కె.వి.ఎస్. వర్మ



“సోవుడూ, బట్టీ దగ్గిర పని జాగర్తగా అవుతోందా” అన్నాడు బుంగ రామయ్య.

“అవుతోందన్నా” అన్నాడు బుంగ సోమయ్య వినయంగా.

వాళ్లిద్దర్నీ నచ్చినవాళ్లు “రామలచ్మణులు” అంటారు. కిట్టనివాళ్లు “దుర్యోదన దుచ్చాసునలు” అంటారు. బుంగ రామయ్యను కొందరలాగే అంటారు. మరికొందరు “దొంగరాముడు” అంటారు. ఇంకొందరు “దుంగ రామయ్య” అంటారు. దొంగ రాముడుగా పేరుతెచ్చుకున్నప్పుడు బక్కగా వున్న బుంగ రామయ్య, బాగా డబ్బు గడించాక, దుక్కలా బలిసి “దుంగ రామయ్య” అయ్యాడు.

“బట్టీ దగ్గిరికి బేగెళ్లు. నువ్వు లేకుంటే ఒక్క ఎదవా ఒళ్లొంచి పన్జేయడు” అన్నాడు రామయ్య గోల్డ్‌ఫ్లేక్‌సిగరెట్ నోట్లో పెట్టుకుంటూ.

“అట్టాగే అన్నా” అని సోమయ్య గబుక్కున కుర్చీలోంచి లేచి బయలుదేరాడు.

వెళ్తున్న సోమయ్యవంక అభిమానంగా చూశాడు రామయ్య.

తొమ్మిదేళ్ల వయసులోనే రామయ్య సింహాద్రిరాజు దగ్గర పనిలోకి కుదిరాడు. పశువుల్ని మేపుకొచ్చేవాడు. పదకొండేళ్లు వచ్చేటప్పటికి కొబ్బరిచెట్లెక్కి కాయలు దింపడం కూడా మొదలెట్టాడు. ఒకనాడు కొబ్బరికాయలు దించాక, చెట్టుదిగి వస్తూ, దగ్గు వస్తే కాండ్రించి ఉమ్మాడు. అది ఓ కొబ్బరికాయమీద పడింది.

“ఛీఛీ. అదేం పనిరా తొత్తుకొడక. ఆ కాయని దూరంగా పెట్టు” అన్నాడు సింహాద్రిరాజు కోపంగా.

రాముడు అలాగే చేశాడు. కాయలన్నీ కొట్టుగదిలోకి మోసుకెళ్లాడు.

“ఈ కాయ కడిగేసి, కొట్టుగదిలో ఏసేస్తానండి” అన్నాడు రాముడు నెమ్మదిగా.

“థూథూ. నువ్వు వుమ్మేసిన కాయని కొట్టుగదిలో పడేస్తావా? ఛీఛీ. దాన్ని ఇంటికి పట్టుకుపో” అన్నాడు సింహాద్రిరాజు అసహ్యంగా ముఖం పెట్టి.

రాముడు సంతోషంగా ఆ కొబ్బరికాయను ఇంటికి కాకుండా కిరాణా కొట్టుకు పట్టుకెళ్లి అడాకు అమ్మేసి, సీమచింతకాయబిళ్లలు కొనుక్కున్నాడు.

‘ఈ రాజుగోరికి చేదస్తం ఎక్కువని వూరోళ్లంతా అంటుంటే ఏటో అనుకున్నాను. మా శానా వుంది’ అనుకున్నాడు రాముడు బిళ్ల చప్పరిస్తూ.

ఓ నెల పోయాక మళ్లీ కొబ్బరికాయలు దించాక, కావాలనే రెండు కొబ్బరికాయలమీద వుమ్మేశాడు రాముడు. సింహాద్రిరాజు కోప్పడి, వాటిని పట్టుకుపొమ్మన్నాడు. ఆ రెండు కాయల్నీ కిరాణాకొట్టులో అమ్మేసి, సీమచింతకాయబిళ్లలతోపాటు కరీంబీడీల్ని కూడా కొన్నాడు

రాముడు. మరికొన్నాళ్లకు మూడు కొబ్బరికాయలమీద ఉమ్మాడు. రాముడు కావాలనే చేస్తున్నాడని గ్రహించి, సింహాద్రిరాజు రెండు తగిలించాడు. ఆ తర్వాత సింహాద్రిరాజు కళ్లుకప్పి కొబ్బరికాయలు కిరాణాకొట్టుకు చేర్చడం మొదలెట్టాడు.ఒకనాడు దొరికిపోయాడు.

దొంగరాముడిని పనిలోకి తీసుకోడానికి రైతులంతా వెనకాడారు. కూలిపనులకెళ్లాడు. ధాన్యం సంచుల్ని ఎత్తుకుపోయాడు. రాముడిని చెట్టుకుకట్టేసి చితకబాదారు. అదిచూసి సోముడు ఏడ్చేశాడు. ఇంటికొచ్చాక, "అలాంటి పన్లు సెయ్యొద్దన్నా" అన్నాడు.

*కొన్నాళ్లు అల్లరిచిల్లరగా తిరిగి, ఓ రాత్రి షావుకారింట్లో బంగారం గొలుసు ఎత్తుకుపోయాడు. అలా పోయి మళ్లీ సొంత వూరికి తిరిగిరాలేదు. కొన్నాళ్లు బ్రాకెట్ బుక్కర్‌గా పనిచేశాడు. అందులోని మెళకువలన్నీ తెలుసుకుని, బ్రాకెట్ కంపెనీ పెట్టాడు.* *ప్రైవేట్ బస్సుల్ని* జాతీయం చేసినప్పుడు, చవగ్గా వస్తుంటే ఓ బస్సుకొని టూరిస్టు బస్సుగా నడిపాడు. తర్వాత సారా పాటలు పాడి, ఆ వ్యాపారం కొనసాగిస్తున్నాడు.

రామయ్య రొయ్యలకూరతో సుష్టుగా భోంచేసి, బెడ్‌రూమ్‌లోకొచ్చాడు. సిగరెట్ వెలిగించి గట్టిగా దమ్ములాగాడు. మంచమెక్కి, సుఖంగా నడుంవాల్చాడు.

బెడ్‌రూమ్ మొజాయిక్ ఫ్లోర్ మిలమిలా మెరుస్తోంది పులికన్నులా. తెల్లగా తళతళలాడుతున్న ఓ గోడమీద కళకళలాడుతోంది ఓ ఆంగ్ల నగ్నసుందరి. ఆ తెల్లసుందరి ప్రత్యేకత ఏమిటంటే, గదిలోంచి ఎటువేపునుంచి చూసినా, చూసినవాళ్లవంక ఆమె దొంగచూపులు చూస్తుంది. ఆ నగ్నసుందరి దొంగ చూపులంటే దొంగరామయ కెంతో ఇష్టం. "నాకు సరిజోడీ. మా సక్కటి దొంగవంజ" అని మెచ్చుకుంటాడు.

రామయ్య హాయిగా నిద్రపోయి లేచాడు. టీ తాగాడు. లాల్చీ వేసుకుని ఇంటి (మేడ) ముందు లాన్‌లో కుర్చీలో కూర్చుని సిగరెట్ ముట్టించాడు. లాన్ పచ్చ పచ్చగా వుంది. సిగరెట్ దమ్ము వెచ్చవెచ్చగా వుంది. గతరాత్రి వుంచుకున్నదాని సరసం తలచుకుంటే అతనికి ముచ్చట ముచ్చటగా వుంది. టైము చూశాడు. 'అయిదు గంటలయ్యింది.

'ఏడింటికల్లా కాంతారావు వచ్చేస్తాడు. ఆడికూడా ఇద్దరాఫీసర్లొస్తారు. ఇదేశీ యిస్కీ అల్రడీగా వుందింట్లో. తొమ్మి దింటికల్లా పార్టీ అయిపోవాల. కాంతారావుకంతా డిసిప్లీను. ఎళ్లేటప్పుడు ఆడికివ్వడానికి పదేవేలు కవర్లోయెట్టి వుంచేసుగందా. డబ్బు దగ్గిర కరాకండీగా వుంటాడుగానీ, కాంతారావు మంచోడు. నాకేకట్టమొచ్చినా ఆదుకుంటాడు. రాజకీయంగా ఆడి పలుకుబడి అంతా ఇంతానా. ఆడింకా పైకెళ్తాడు' అనుకున్నాడు రామయ్య కళ్లు మూసుకుని సిగరెట్ కాలుస్తూ.

రామయ్య మేడకు అల్లంత దూరంలో సూర్యకిరణాలుపడి, పచ్చకొండ పసిడిముద్దలా మెరుస్తోంది. పచ్చకొండ మీద మేత మేస్తున్న గొర్రెలు ఆకాశం నుంచి షికారుకొచ్చిన తెల్ల మబ్బుల్లా వున్నాయి. ఈ పచ్చదనం అంతా తమదే అనుకుంటున్న తెల్ల గొర్రెలకు తమ ప్రాణాలు తమని కావని తెలీదు. షికారుకొచ్చిన తెల్ల మబ్బులకూ తాము నీరయి కరిగిపోతామని తెలీదు. తెల్ల గొర్రెలూ తమకోసం తిండితినడంలేదు. తెల్లమబ్బులూ తమకోసం షికారుకు రాలేదు.

సిగరెట్ పారేసి, ఒళ్లు విరుచుకుని కుర్చీలోంచి లేచాడు రామయ్య. పచ్చని లాన్‌లో తెల్లలుంగీ, తెల్లలాల్చీలో పచార్లు చేస్తున్న రామయ్య పైరు చేనుపై చక్కర్లు కొట్టే తెల్ల రాక్షసి కొంగలా వున్నాడు.

గేటు తీసుకుని వస్తున్న నౌకర్ని చూశాడు. అతని భుజంపై వున్న తోలు తీసేసిన గొర్రెపిల్లను చూశాడు.

"పులావు బాగా సేయించు" అన్నాడు రామయ్య అతనితో.

చీకటి పడింది. రామయ్య ఇంట్లోకి వెళ్లాడు. వేన్నీళ్ల స్నానం చేశాడు. బట్టలేసుకుని విదేశీ సెంటు రాసుకున్నాడు. టీ తాగాడు. పలావ్ వంటకం ఎంతవరకూ అయ్యిందో వాకబు చేశాడు. హాల్లో టీ.వీ. చూస్తూ కూర్చున్నాడు.

"ఇంకోసారి టీ పంపమన్నావేటి" అంది రామయ్య భార్య పక్కనే కుర్చీలో కూర్చుంటూ.

"ఇప్పుడే తాగేనుకదా, వద్దులే. అయినా ఇది టీయేళేటే" అన్నాడు నవ్వుతూ.

"సాల్లే సంబడం" అని ఆమె కూడా నవ్వి, "మన బేబీ ఈ ఏడు డాక్టరయిపోతందిగందా. మనూళ్లో సేటీసు యెట్టుకోడానికి ఏర్పాట్లు మొదలెట్టావా" అంది.

"ఓసోస్. బేబీ నీకేనేటే కూతురు. అన్నేర్పాట్లూ సేయిస్తున్నా. నువ్వేటీ ఇదయిపోకు"

"నా తల్లిమనసు నాదిలే. సేస్తన్నావుగందా, ఇంకేటి బెంగ" అంది తృప్తిగా చూస్తూ.

రామయ్య గోడగడియారం వంక చూశాడు. పది నిమిషాలు తక్కువ ఏడయింది.

"పులావు రుసి సూసేవా"

"సూసేను. పక్కాగా కుదిరింది"

'గుడ్' అన్నట్టు ఆమె వంక చూసి "అన్నీ టేబుల్ మీద రెడీగా పెట్టించు. సని కుర్రోళ్లిద్దర్నీ పార్టీ అయ్యేదాకా వుండమను" అని భార్యతో చెప్పి, లాన్‌లోకెళ్లాడు.

అంతలో కాంతారావు కారు గేటు ముందాగింది. రామయ్య గబగబా అటు వెళ్లాడు.

చర్చించుకున్నారు. రామయ్య తెచ్చిన బేగ్ తీసుకుని ఆఫీసర్లకు కొంత ఇచ్చి, మిగతాది తన దగ్గర వుంచాడు కాంతారావు. ఆఫీసర్లు వెళ్ళిపోయారు.

"రామన్నా, ఏది సేసినా జాగర్తగా సెయ్యాల. సారాలో అయ్యేవో రసాయనాలు కలిపేయించినట్టున్నావు. ఇప్పుడు సూడు, సలభై మంది సచ్చేరు. ఆస్పిటల్లో సేరినోళ్ళలో ఇంకెంతమంది సస్తారో సెప్పలేం" అన్నాడు కాంతారావు చిరాగ్గా ముఖం పెట్టి.

"ఇలాటియేయీ సేయకపోతే యాపారాల్లో నాబాలెట్టా వస్తాయి సెప్ప కాంతన్నా. నేనేవన్నా ఒరేబాబూ నా సారా తాగొరే అని బతిమాలేనా? ఆళ్ళకి సవగ్గా సారా గావాల గనక నేను సేయించేను. అయితే ఈసారి ఆ కెమికల్సు పాలు ఎక్కువైనట్టుంది. అంతెందుకు, ఈ యిస్కీని మన్లాంటోళ్ళు ఎంతయినా యెట్టి కొని తాగ్గలం కాబట్టే గందా ఆళ్ళు తయారు సేస్తన్నారు. 'ఏటంటావు" అన్నాడు రామయ్య ఖాళీ గ్లాసు టేబుల్ మీద పెడుతూ.

"నేనేటంటాను. నువ్వు రైటేనంటాను. ఇంకెంత మంది ఆఫీసర్లకు ఎంత తడపాలో"

"నువ్వేటి సేస్తావో నాకు తెల్దు. ఇంకొక్క సైస ఇవ్వను."

"సర్లే, ఇంకిదయిపోకు" అన్నాడు కాంతారావు గ్లాసు నింపుతూ.

ఆ రాత్రి వాళ్ళకలా గడిచింది. కల్తీ సారా తాగినోళ్ళలో మరో పది మంది మరణించారు. ఇంకొందరి పరిస్థితి ప్రమాదకరంగా వుంది.

## భావ

త్రాలంకృతి సృష్టి నాట్యరంగముపై న
ల్మాలల క్రమ్మెడు నుత్సవ
లీలలలో క్రమ భావరేఖవు, రమ్మా.

శ్రీముఖ మట్టియ చప్పుడు
లే మూలనో విశ్వకుహర లీనములయ్యెన్
నీ మసృణాగమన శుభ
క్షేమ నిరీక్షణము చేయు క్షితి యూగడియన్.

ఎఱుపులు తఱిగెడి మంచుల
చిరుకణముల వరుస మెఱయు చివురుల యొడిలో
విరిసరులు పఱచి మురిపెపు
చిరునగవులు కురియు సంజ చెల్వము గనుమా.

చేతకు మాటకు బీజము
లోతగు భావమ్ము గద, స్వరూపమె భావ
ద్యోతకమగు నూతన చై
త్రాతిథి నీ సూక్తి నాటదగు నీ ధాత్రిన్.

అర్థరహితమౌ ముక్కడి
స్థరల బడబానల ప్రభంజన ధాటిన్
వ్యర్థమ్మౌ దౌర్జన్య
స్వార్థము చల్లార్చు సరళభావము నిమ్మా.

పేరే భావ గదా, నీ
పేరు చిరస్థాయిగా నభిన్నమ్ముగ నీ
ధారుణి నిల్పుము, నీ వీ
మారిటురా నీకె విభ్రమమ్మగు నటులన్.

— వేమూరి వేంకట రామనాధము
*Piscataway, NJ*

భావవీచిక *23*

## స్వాగతగీతి

'శ్రీముఖం' మిగిల్చిన గతస్మృతులు
మిగులులు మిగుల్చుకుని, తలచుకొని
ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపిగురుతులు
అనుకొని
పైశాచిక వైషమ్యాలకు తిలోదకాలిచ్చి
రాబోయే రేపటిరోజులు
కనబోయే బంగారుకలలు
ఆశల ఆశయాల గమ్యం వైపు
ఆర్తిగా ఎదురుచూసే జనావళికి
చిరుదివ్వెవై దారిచూపు
'భావనామ' వత్సర కాంతిరేఖవై
చీకటి కమ్మిన జీవితాల జీవనరేఖవై
ప్రజ్వలించు
'శ్రీ భావనామ'సంవత్సరమా!
ఇదే నా స్వాగతగీతి

—ధనికొండ వెంకటేశ్వరి
*Hyderabad, AP*

ఇది జరిగిన మూడోరోజు రాత్రి మూడో పెగ్గులో వుండగా రామయ్యకు సోమయ్య చావు కబురందింది. రామయ్యకు గుండాగిపోయినంత పనయింది. సోమయ్యను ఎవరో గొడ్డలితో నరికి చంపేశారని నౌకరు చెప్పగానే రామయ్య పరిగెట్టాడు.

నెత్తుటి మడుగులో వున్న సోమయ్యను చూడగానే రామయ్య గుండె చెరువయ్యింది.

"సోముడూ. నా బంగారు తమ్ముడూ నన్నిడిచి ఎళ్ళిపోనావా. నేనంటే పేణం యెట్టేవోడివి. సివరికి నా కోసరం పేణం పోగొట్టుకున్నావు కదరా. నీ బదులు నేను పోయినా ఎంత బావుండునురా. నన్నింక 'అన్నా' అని పేమగా పిల్చే వోళ్ళెవ్రా. ఒరే తమ్ముడూ సోముడూ నాయనా నువ్వు నేకుండా నేనెట్టా బతికేదిరా" అంటూ రామయ్య భోరున ఏడుస్తుంటే, అప్పుడే అక్కడికొచ్చిన కాంతారావు కడుపు తరుక్కుపోయింది.

"ఊరుకో రామన్నా, సోమయ్యకూ మనకూ రుణం తీరిపోనాది. జరగాల్సింది సూడు" అని కాంతారావు రామయ్యను ఓదార్చబోయాడు.

ముక్కు చీది, కళ్ళు తుడుచుకుని, "కాంతన్నా, సూత్తాను. ఇది ఆడిపనే. మా సోముడి మీద బదులు తీర్చుకున్నాడు. ఆ తాతిగాడి అన్ననే కనక నేను లేపెయ్యకపోతే నాపేరు రామయ్యే కాదు" అని శపథం చేశాడు రామయ్య పళ్ళు పటపట కొరుకుతూ.

మరి, కల్తీ సారా బాధితుల్లో కూడా ఎవరైనా అలాంటి శపథం చేసి వుంటారా?

(శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి 'కుక్కపిల్ల' కథలోని ఒక సూక్తి ఆధారంగా ఈ కథ)

## గీత స్వగతం

– శాంతి శారదాపూర్ణ

అదె అల్లదె అల్లన మెల్లన
మొదలై తాసిరి చిటి పోటి నడకల
పలురంగులుగా గానము చిమ్ముచు
కదలి సాగినది నా ఎద భావము

ధర్మము గూడిన కరుణ విధమ్మున
వాక్కున గల భవ్యార్థము లాగున
ఆత్మను గల పరతత్త్వము బట్టుచు
దివ్యజ్ఞానస్మిత రాగముగా
దిగంతములకై ప్రాకెను భావము
నా ఎద సాక్షిగ నారొద సాక్షిగ
పంచేంద్రియములు పరమసాక్షిగ
గగనమ్మున వేలుపు లచ్చెరువడ
గట్లు తెగిపారె నాలోని భావము
నాలోని భావమే సంగీతజ్ఞానమై
శ్రుతులుగా కృతులుగా నవనవాకృతులుగా
త్యాగయ్య గొంతులో ఆడెగా మ్రోగెగా
నాలోని రాగమే పలుకుతేనెలుగురియ
మహతి విపంచిలో రాగాను రక్తితో
స్పందించి నినదించి అన్నమయ ఎడదలో
కుప్పలై నిండి పడి యుండెగా
నాలోని గానమే గోపికల చరణాల
యోగినీ హృదిలోన రాధికా కింకిణుల
జయదేవ భారతిగ వెలెసెనో యాశక్తి!

తీవరిపడి నాఆశ క్షేత్రయ్య గీతాల
క్షేత్రాన మంజరుల ఐక్యమై దివ్యమై
నింపెగా విమలమై భక్తి ప్రసక్తి!
ఎద బుట్టి నామాట అలనాటి ఆదాను
ఆటగా పాటగా పూతమై తీర్థమై
చిందెనదిగో అల్ల అనురాగ విస్ఫూర్తి!
ఊపిరే వేణువై నాడులే వీణలై
ఎడద మద్దెళ దడల ఆడగా తోడుగా
నాలోని భావమ్ము ఘనరాగ రక్తితో
సంగీతలహరిగా సరిగమలశక్తితో
పల్లవించు మమించి అనుపల్లవినిగూడి
ఘనరాగతాన సంధానమై తేలెగా!
సన్న నల్లని మబ్బు విరుగవే వేయిగా
నామనసు తనకుతావిరజిమ్ముచును పోయి
ఎన్నినాళ్ళకుదిగ్ దిగంతాల నటనించె!

శతాబ్దాల పరుగులతో
నిశ్శబ్దం జగత్తంత
కాలము తాపాపం
కదలాడక క్షణకాలం
నివ్వెఱవడి నిలచెనుపో
కరుణదీప్తి నెరపెనుపో
ఎదపొంగిన పాటపొంగు
పరవశించి ప్రజ్వలించి
శ్రీదమ్మై శాంతమ్మై
కవిగాయక గళములలో
భావకవుల చిత్తవీధి
పూర్ణమైన గీతమై
అవ్యయాన మోసులెత్తె ||

## అహంభవుడు

అహంభవుణ్ణో నేను
నన్ను మించిని వాడిలలో లేదని
అహం అహర్నిశలు గందరగోళం చేస్తున్నది.
నరంలేని నాలుక వంతలు పాడుతున్నది.
మనోపథంలో ఆశల హర్మ్యాలు కడుతున్నది.
ఆకాశపుటంచులు చూపుచున్నది.
ఆవలున్న దేవలోకంలోని ఇంద్రుని
ప్రక్కకునెట్టి ఇంద్రవైభవం చేబట్టమంటున్నది.
రంభ ఊర్వశి మేనక తిలోత్తమలే
నాలో పొత్తుకు తగినవారంటున్నది.
ద్వాపరయుగమున ధర్మ సం
స్థాపనార్థమై వెలసిన
నరనారాయణులలో నరుడైన
అర్జునుడే నేనంటున్నది.
పాపభూయిష్టమైన
యీ కలియుగంలో
నాలాంటికారణజన్ములకు
కర్తవ్యమేమియూ కానరాదంటున్నది.
ఆముష్మిక దిశలను జూపి
తిరుగుపయనం కట్టమంటున్నది.

— డి. రామకృష్ణయ్య
*Hyderabad, India*

## సాధన

ప్రణవాకాశంలో పరమావధి
పవిత్ర హృదయమే గూఢనిధి
కోరికలను అణచి ధ్యేయము యెంచి
అహంకారము తొలగించి అంతరాత్మను గెలచి
ప్రేమమయమైన ఈ అనంతవిశ్వముగని
మానవసేవయే మాధవస్వరూపములని
దేహాభిమానము త్యజించి
సుఖదుఃఖముల బారి తొలగించి
మాయామోహముల నశించ
పరమాత్మని పరిశోధన యత్నించ
ధీరత దృఢనిశ్చయము విశ్వాసము శక్తికాగ
నిర్భయముగా సాగును నీ తీర్థయాత్ర
శుభమవుగాక
మధురానందమయమైన ఆ జ్యోతి
అమృతపానము అర్థించు ఆత్మజ్యోతి
నీ నిజజీవితంలో సాధించ ఆ దివ్యజ్యోతి

— టి.ఎస్. లక్ష్మి మోహన్
*Stillwater, OK*

1989 లోని ముద్రిత రచన–